ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
సోమవారం 20 అక్టోబరు 2025

దీపావళి సందడి



పండగ అంటేనే పిల్లుబికే ఆనందం. అందునా దీపావళి అంటే పిల్లల ముఖాలన్నీ దివ్వెల్లా వెలిగి పోతాయి. చిత్తూరు నగరంలో ఆదివారం ఎటుచూసినా దీపావళి కళ కనిపించింది. టపాసుల అంగళ్ల వద్ద పిల్లల కోలాహలం.. పూలంగళ్ల వద్ద ఆడవాళ్ల హడావుడి.. కిటకిటలాడుతూ గుడ్డలంగళ్లు.. చర్చివీధి, బజారువీధి, డీఐరోడ్డు, ప్రకాశం హైరోడ్డు జనంతో నిండిపోయాయి. కట్టమంచిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాలు జనంతో కిక్కిరిసాయి. డీఎస్పీ సాయినాథ్, డీఎఫ్‌వో పెద్దిరెడ్డి, ఏడీఎఫ్‌వో కరుణాకర్ టపాకాయల దుకాణాలవద్ద పర్యవేక్షించారు. - చిత్తూరు సిటీ, ఆంధ్రజ్యోతి

కొండకిందపల్లెలో జల్లికట్టు

వెదురుకుప్పం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం కొండకిందపల్లెలో ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో జల్లికట్టు జరిగింది.చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఆ గ్రామానికి జనం చేరుకున్నారు.కోడెగిత్తల కొమ్ములకు పట్టీలను కట్టి అల్లి వైపు వదలడంతో యువకులు ఆ పట్టీలను దక్కించుకోవడానికి గిత్తలను నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో తిరుపతికి తరలించారు.







బజారువీధిలో కురుస్తున్న మంచు



రామకుప్పాన్ని ఆవరించిన పొగమంచు

మంచుదుప్పట్లో....

రామకుప్పం పట్టణాన్ని ఆదివారం ఉదయం పొగమంచు కప్పేసింది. ఉదయం 8గంటల వరకు మంచు దొంతరలు తొలగక పోవడంతో వాహనచోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. సాయంత్రం వేళ కూడా మంచు కురవడంతో చలితీవ్రత పెరిగింది.

- రామకుప్పం, ఆంధ్రజ్యోతి

‘పీజీఆర్ఎస్’ రద్దు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో,జిల్లా పోలీసు కార్యాలయంలో జరగాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమాలను రద్దు చేశారు. ప్రజలెవరూ వ్యయ ప్రయాసల కోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని అధికారులు సూచించారు.

తాలూకా ఎస్ఐ సస్పెన్షన్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు తాలుకా ఎస్ఐ మల్లికార్జునను ఎస్పీ తుషార్ సస్పెండ్ చేశారు. దీపావళి సందర్భంగా ఏటా నగరంలోని టపాసుల దుకాణదారులంతా కలిసి సుమారు 400 టపాసుల బాక్సుల్ని తాలుకా పోలీసులకు అప్పగిస్తారు. ఇక్కడి నుంచి జిల్లా కేంద్రంలో ఉన్న పోలీసు శాఖలోని అన్ని విభాగాల సిబ్బందికి ఆ బాక్సులు అందుతాయి. అన్ని దుకాణదారులు కలిసి కొంత మొత్తంలో డబ్బులు కూడా ఇస్తారు. దాన్ని ఆయుధ పూజకు, ఉన్నతాధికారులకు డ్రైఫ్రూట్స్ వంటి వాటికి ఖర్చు చేస్తారు. ఇది ఈ స్టేషన్‌లో ఏటా జరిగే తంతు.ఏటా టపాసుల దుకాణదారుల తరఫున దీన్ని డీల్ చేసే వ్యాపారి ఈసారి కూడా ఎస్ఐ మల్లికార్జునతో మాట్లాడారు. ఈసారి టపాసుల బాక్సులు 50కి మించి ఇవ్వలేం అన్నారు. చాలామందికి ఇవ్వాల్సి ఉంది, 50 సరిపోవు, కనీసం 400 బాక్సులు అయినా ఇవ్వండి అని ఎస్ఐ అడిగారు. డబ్బుల గురించి కూడా ఆ వ్యాపారి కావాలనే పదే పదే ఎస్ఐతో చర్చించారు. దీన్ని మొత్తం రికార్డు చేశారు. ఓ ప్రజాప్రతినిధి పీఏతో ముందుగా అనుకున్న ఒప్పందం మేరకు ఎస్ఐతో మాట్లాడిన రికార్డింగును పీఏకి ఇచ్చారు. ఆ పీఏ దీన్ని డీఐజీకి, కలెక్టర్‌కు, ఎస్పీకి పంపించారు. దీంతో ఉన్నతాధికారులు అప్పటికప్పుడు మల్లికార్జునను సస్పెండ్ చేశారు.

చారాల చెరువు మొరవ ఉధృతం


● కొట్టుకుపోయిన ద్విచక్రవాహనం ● నీట మునిగిన వరి,వంగ పంటలు



చారాల చెరువు మొరవ



నీట మునిగిన వరి పంట



మొరవ నీటి ప్రవాహంలో కొట్టుకు పోతున్న ద్విచక్రవాహనం ఒడ్డుకు లాగుతున్న జనం

చౌడేపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):చారాల చెరువు మొరవ ఉధృతం కావడంతో పంటలు నీట మునిగాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలో పెద్ద చెరువుల్లో ఒకటైన చారాల చెరువు మొరవ పోతోంది. జంగాలపల్లె-చారాల మార్గంలో మొరవ నీళ్ళు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు బంద య్యాయి.జంగాలపల్లెకు వెళ్ళాలంటే చారాల నుంచి చౌడేపల్లెకు వెళ్లి అక్కడి నుంచి బీర్జేపల్లె మీదుగా సుమారు 10 కిలోమీటర్లు చుట్టుకుని వెళ్ళవలసిన పరిస్థితి నెలకొంది. జంగాలపల్లెకు చెందిన రెడ్డెప్ప ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంలో చౌడేపల్లెకు వెళుతుండగా మొరవనీటిలో కొట్టుకు పోయారు. గమనించిన స్థానికులు ఆయనకు తాడు అందించి రక్షించారు.ఆయన ద్విచక్రవాహనాన్ని కూడా తాళ్ళసాయంతోనే ఒడ్డుకు చేర్చారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సుమారు 100 ఎకరాలకు పైగా వరి పంట నీట మునిగింది. అలాగే శెట్టిపేట వద్ద వంకాయ తోటతో పాటు, పలువురు రైతులకు చెందిన వరి పంట కూడా నీట మునిగింది.పంట నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు ఏవో మోహన్‌కుమార్ తెలిపారు.

19మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం కారణంగా గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో తే లికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా చౌడేపల్లెలో 56, అత్యల్పంగా చిత్తూరు అర్బన్‌లో 0.4 మి.మీ వర్షం కురిసింది. మండలాల వారీగా సోమలలో 9.2, పుంగనూరులో 34.6, ఐరాలలో 12.8, గుడిపాలలో 10, తవణంపల్లెలో 9.8, కార్వేటినగరంలో 9.4, సదుంలో 8.2, రొంపిచెర్లలో 7.2, పులిచెర్లలో 7, ఎస్ఆర్‌పురంలో 6.2, పెద్దపంజాణి, గంగవరంలో 5.8, కుప్పంలో 5.4, పెనుమూరులో 3.2, గుడుపల్లెలో 2.6, చిత్తూరు రూరల్‌లో 1.6, వీకోటలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

మమ్మల్ని పట్టించుకోరా?

చిత్తూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యులు ధర్నా నిర్వహించారు.19 రోజులుగా విధులు మానేసి ధర్నా చేస్తున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

19మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం కారణంగా గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా చౌడేపల్లెలో 56, అత్యల్పంగా చిత్తూరు అర్బన్‌లో 0.4 మి.మీ వర్షం కురిసింది. మండలాల వారీగా సోమలలో 9.2, పుంగనూరులో 34.6, ఐరాలలో 12.8, గుడిపాలలో 10, తవణంపల్లెలో 9.8, కార్వేటినగరంలో 9.4, సదుంలో 8.2, రొంపిచెర్లలో 7.2, పులిచెర్లలో 7, ఎస్ఆర్‌పురంలో 6.2, పెద్దపంజాణి, గంగవరంలో 5.8, కుప్పంలో 5.4, పెనుమూరులో 3.2, గుడుపల్లెలో 2.6, చిత్తూరు రూరల్‌లో 1.6, వీకోటలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

బంగారుపాళ్యం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): పిల్లలు పుట్టలేదని మనస్తాపంతో ఓ వివాహిత బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని వెలుతురుచేను పంచాయతీ శ్రీనివాసపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. శ్రీనివాసపురానికి చెందిన ప్రకాష్‌కు గుడియాత్తం తాలూకా తట్టపారకు చెందిన రాజశ్రీతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ఈ నేపథ్యంలో పిల్లలు కలగలేదని మనస్తాపంతో శనివారం ఇంటిలో నుంచి వెళ్లిపోయింది. దీంతో బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం పులిమడుగు సమీపంలోని మునిక్రిష్ణయ్య బావిలో రాజశ్రీ(20) మృతదేహం లభ్యమైంది. బంగారుపాళ్యం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబుకు ఉపాధ్యాయుల పాలాభిషేకం



కుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక డీఏను ప్రకటించిన నేపథ్యంలో కుప్పం నియోజకవర్గ ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్థానిక మండల సచివాలయం ఆవరణలో ఆదివారం నియోజకవర్గ ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల ఆవేదనను అర్థం చేసుకొని ఒక డీఏను ప్రకటించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన డీఏలను విడుదల చేయడంతోపాటు పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవులు, రాజేశ్వర కుమార్, శ్రీరాములు, సురేంద్ర బాబు, నారాయణ స్వామి, సురేశ్, రామచంద్ర, రామ సుబ్రహ్మణ్యం, భాస్కర్, గణపతి, తులసీదాసు, ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఆదివారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యులు ధర్నా నిర్వహిస్తున్నారు. వైద్యులు మాట్లాడుతూ గత 19 రోజులుగా విధులు మానేసి ధర్నా చేస్తున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు

● ప్రభుత్వ విప్ థామస్



జీఎస్టీ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ థామస్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో ఏన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ప్రజలకు మేలు కలిగించే పలు కార్యక్రమాలను చేపడుతున్నామని, ఇందులో వన్ నేషన్- వన్ ట్యాక్స్ అమలు అనేది చారిత్రాత్మక నిర్ణయమని ప్రభుత్వ విప్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ చెప్పారు. ఆదివారం సూపర్ జీఎస్టీ-సూపర్ తగ్గింపుపై జిల్లాలోని అన్ని శాఖల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే భవన్‌లో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 ద్వారా పన్నులను తగ్గించిందని చెప్పారు. జీఎస్టీ వల్ల జరిగే మేలును జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి దాదాపు ఏడాదికి రూ.18 నుంచి రూ.20వేల మేర ఆదా అవుతుందన్నారు. అనంతరం జ్యోతిరావు పూలే భవనంలో ఏర్పాటు చేసిన 36 స్టాళ్లను ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ఈ సమావేశంలో డీఆర్వో మోహన్ కుమార్, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దీపావళి పండగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలి



ఎస్పీ తుషార్ డూడీ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ తుషార్ డూడీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. భద్రతా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా జరుపుకోవాలన్నారు.రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాద నివారణ చర్యల ద్వారా ప్రజలకు సహకరించడానికి పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉంటారన్నారు.

థియేటర్‌లో సీట్లకోసం.....

చిత్తూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర థియేటర్ వద్ద ఆదివారం రాత్రి వాగ్వాదం చోటుచేసుకుంది.నగరానికి చెందిన ఓ కుటుంబం సెకండ్ షోకు వచ్చింది. టికెట్ కౌంటర్ వద్ద కుటుంబంతో వచ్చాను పలానా సీట్లు కావాలని ఆ ఇంటి యజమాని కోరాడు. అందుకు సరే అన్న టికెట్లు ఇచ్చే వ్యక్తి ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించమన్నాడు. తీరా డబ్బులు పంపించాక వేరే సీట్లు కేటాయిస్తానని చెప్పడంతో ఆ ప్రేక్షకుడు తన డబ్బులు వెనక్కివ్వాలని కోరాడు. దీనికి టికెట్లు ఇచ్చే వ్యక్తి ఆ టికెట్లు తీసుకోవాల్సిందేనని దురుసుగా ప్రవర్తించాడు. థియేటర్ నిర్వాహకుడు కూడా తీసుకుంటే ఆ టికెట్ తీసుకో... లేకుంటే బయటకు వెళ్లు అనడంతో ఆ ప్రేక్షకుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి టికెట్ల డబ్బులు వెనక్కి ఇప్పించారు.

ఎస్వీఎంసీలో పారా మెడికల్ కోర్సులకు ఇంటర్వ్యూలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలోని పలు డిప్లమా అల్లైడ్ హెల్త్‌సైన్స్ ప్రొఫెషనల్ కౌన్సిల్, పారా మెడికల్ కోర్సులకు సంబంధించి మిగిలిన సీట్లకు ఈ నెల 21న కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవిప్రభు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లమా ఇన్ అనస్థీషియా టెక్నాలజీలో 3, డిప్లమా ఇన్ మెడికల్ లేబొరేటరీ టెక్నాలజీలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. వీటికి మంగళవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు విద్యార్థులు హాజరుకావాలని కోరారు. 9440879943కు సంప్రదించాలని పేర్కొన్నారు.

జలదిగ్బంధంలో గ్రామాలు..!

● కొట్టుకుపోయిన తాత్కాలిక కల్వర్టులు ● వర్షాకాలం వస్తే ప్రయాణానికి తిప్పలు



చెన్నపట్నం చెరువు మొరవ ఉధృతి

సోమల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు పలు తాత్కాలిక కల్వర్టులు కొట్టుకుపోయాయి. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించి జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సోమల - నంజంపేట మార్గంలోని సరస్వతీపురం వద్ద జీడిరేవుల వంక ఉధృతంగా ప్రవ హించి రాత్రి 8 గంటలకు తాత్కా లిక కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో పెద్దఉప్పరపల్లె, నంజంపేట, ఆవుల పల్లె, అన్నెమ్మగారి పల్లె, పేటూరు పంచాయతీల్లోని గ్రామాలకు ప్రజలు ఈ మార్గంలో వెళ్లలేక పోతున్నారు. నంజంపేట - పొదలకుంటపల్లె మార్గంలోని దళవాయి చెరువు వద్ద తాత్కాలిక కల్వర్టు వరదనీరు ముంచెత్తింది. దీంతో కల్వర్టు కొట్టుకుపోయింది. ఈక్రమంలో రాకపోకలు స్తంభించాయి. అలాగే చెన్నపట్నం చెరువు మొరవపై నిర్మించిన కల్వర్టు ఇటీవల కొట్టుకుపోవడంతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆ చెరువుతోపాటు ఈ మార్గంలోని గువ్వల గుట్టను సందర్శించారు. సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు చొరవ తీసుకుని గ్రామస్తులు, దాతలు విరాళాలు సేకరించి గువ్వలగుట్ట మార్గంలో తాత్కాలిక కల్వర్టును ఏర్పాటు చేశారు. వారం లోపే శనివారం రాత్రి కురిసిన వర్షాలకు చెన్నపట్నం చెరువు మొరవ ఉధృతి పెరిగి కల్వర్టు కు గండి పడి కొట్టుకు పోయింది. దీంతో గువ్వలగుట్ట మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ఆవులపల్లె - పెద్దఉప్పరపల్లె మార్గంలోని సీతమ్మ చెరువు మొరవనీరు ఉధృతంగా ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గార్గేయనది ఉధృతంగా ప్రవహించడంతో రెడ్డివారిపల్లె, పేటూరు, బసవపల్లె, బోనమందలకు రాకపోకలు లేక జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఏళ్ల గడుస్తున్నా గార్గేయ అలాగే నదిపై వంతెనల నిర్మాణం నోచుకోకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. వర్షాకాలం వస్తే ప్రయాణాలు గగనంగా మారుతున్నాయి. పెద్దఉప్పరపల్లె వద్ద గార్గేయనది ప్రవహించడంతో అటు వైపున ఉన్న రెడ్డివారిపల్లె, బోనమంద, దుర్గంకొండ ఆలయానికి, పేటూరు, బసవపల్లె, చిన్నకమ్మపల్లె, చిన్నతోపు, పొలికిమాకులపల్లె, ఎర్రగుంతల పల్లె తదితర గ్రామాల ప్రజలు పెద్దఉప్పరపల్లెకు వచ్చి నిత్యావసర వస్తువులు తెచ్చు కోలేక పోతున్నారు. వైద్య సేవలు పొందలేక పోతున్నారు. భారీ వర్షాలతో తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయి 7 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ప్రజలు వరదనీటిలో ప్రయాణం చేయక తప్పడం లేదు. గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు సమస్యను మొరపెట్టుకున్నా స్పందన కరవైంది. ఇప్పటికైనా వంతెనలు నిర్మించి ప్రజల కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.



జీడిరేవుల వంకపై కొట్టుకుపోయిన కల్వరు, వంక ఉధృతిని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్



చెన్నపట్నం చెరువు మొరవపై కల్వర్టుకు గండి



నంజంపేట-పొదలగుంట్లపల్లె మార్గంలో గండిపడ్డ దళవాయి చెరువు

జూపల్లిలో గజరాజుల దాడులు

కల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని పాళెం పంచాయతీలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో అపారనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోదబండ నుంచి శనివారం రాత్రి బయలుదేరిన 7 ఏనుగుల గుంపు అటవీ సరిహద్దులో ఉన్న పాళెం పంచాయతీ జూపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు శివయ్య, రఘు, జయపాల్, మునస్వామి, మోహన్, సుబ్బరత్నకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఏనుగుల గుంపు పూర్తిగా విరిచేశాయి. కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. పశుగ్రాసాన్ని తినేశాయి. పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపును గమనించిన గ్రామస్తులు టపాకాయలు పేల్చారు. టపాకాయలు శబ్దాలు వినడంతో ఏనుగుల గుంపు వచ్చిన మార్గంలోనే తిరిగి అడవిలోకి వెళ్లిపోయాయి. ఆదివారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు వద్ద ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు ప్రజలు తెలిపారు. అటవీ సరిహద్దు గ్రామాలకు సమీపంలోని అడవిలో ఏనుగుల గుంపు తిష్ట వేశాయని, దీంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎఫ్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవో మధు హెచ్చరించారు.



మామిడిచెట్టు కొమ్మలను పూర్తిగా విరిచేసిన ఏనుగులు (వృత్తంలో)

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మురళి

చిత్తూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని ఓ పాఠశాలలో సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కార్యదర్శిగా షణ్ముగం, అసోసియేట్ అధ్యక్షుడిగా సంతానం, అడిషనల్ కార్యదర్శిగా వినాయక, కన్వీనర్‌గా బాబు, ఉపాధ్యక్షులుగా సుబ్రమణ్యం, ప్రసాద్, రమేష్, నవీన్, నరేష్, సుబ్బలక్ష్మి, ప్రణీత, రజిని, కవిత, సురేఖ, మాధవ ప్రసాద్, రఘుపతి, గుణశేఖర్, షణ్ముగం, అన్బురాజ్, సిద్దయ్య, కృష్ణప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా దేవరాజులు, మహేష్, కుమార్, ప్రవీణ్, చిరంజీవి, ప్రగతి, ప్రతిభ, చెన్నకేశవులు, కృష్ణయ్య, వెంకటరమణ, రెడ్డప్ప, చిన్నయ్య, చెంగయ్య, పురుషోత్తం, రమ్య, సులోచన, లోకనాథన్, సురేష్, చిన్నప్ప, మురగయ్య, గుణశేఖర్, రాజేష్, మొగిలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు.



ఎన్నికైన నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం

అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

● కారును తప్పించబోయి బోల్తాపడ్డ డీజిల్ ట్యాంకర్





డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు, బోల్తాపడ్డ డీజిల్ ట్యాంకర్

బంగారుపాళ్యం, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిలో సంక్రాంతిపల్లె వద్ద ఆదివారం కారును తప్పించబోయిన డీజిల్ ట్యాంకర్ బోల్తాకొట్టింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు సంక్రాంతిపల్లె వద్దకు చేరుకోగానే అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. అదే సమయంలో యాదమరి నుంచి డీజిల్ లోడుతో పలమనేరు వైపు వెళుతున్న ట్యాంకరు వైపు కారు దూసుకొచ్చింది. దీంతో డీజిల్ ట్యాంకర్ డ్రైవర్ ఆ కారును తప్పించబోగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న చిత్తూరు అగ్నిమాపక సిబ్బంది బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు, ఎస్సై ప్రసాద్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను మళ్లించి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పాలారు పరవళ్లు..!

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం పట్టణానికి ఆనుకుని ప్రవహించే పాలారు నది పరవళ్లు తొక్కుతోంది. కర్ణాటక రాష్ట్రంలో కొనసాగుతున్న భారీ వర్షాలతో రాష్ట్ర సరిహద్దుల్లోని చెరువులు నిండి మొరవలు పోతున్నాయి. ఈ వరదనీరు గురువారం ఉదయం రామకుప్పం మండలం కొళ్ళపల్లె వద్ద ప్రారంభమయ్యే పాలారు నదికి చేరుకున్నాయి. మూడు రోజుల పాటు ప్రవహించిన జలాలు శనివారం రాత్రి శాంతిపురం పట్టణానికి చేరువలోని పాలారు చెక్‌డ్యాంకు చేరుకున్నాయి. ఆదివారం తెల్లవారుజామున చెక్‌డ్యాం నిండి జలాలు కిందికి హోరు శబ్దం చేస్తూ జాలువారుతున్నాయి. కొన్నేళ్ల తర్వాత పాలారు పరవళ్లు నియోజకవర్గ రైతుల్లో సంతోషం నింపుతోంది. కుప్పం నియోజకవర్గంలో సుమారు 38 కిలోమీటర్లు ప్రవహించే పాలారు నదీ జలాలు తమిళనాడుకు చేరుకుంటాయి. ఈ నదీ పరీవాహక ప్రాంతంలో సుమారు నాలుగేళ్లుగా వర్షాలు నామమాత్రంగా కురవడంతో భూగర్భజలాలు తగ్గిపోయి రైతులు ఇబ్బందులకు గురయ్యారు. పాలారు నది ఒకసారి ప్రవహిస్తే ఈ ప్రాంతంలో రెండేళ్లపాటు భూగర్భజలాలు పుష్కలంగా ఉంటాయి. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



శాంతిపురం వద్ద నిండుజలాలతో పాలారు చెక్‌డ్యాం



పాలారు చెక్‌డ్యాం నుంచి జలప్రవాహం

థ్యాంక్యూ సార్...ప్రభుత్వ బహుమతి అందింది



పూజకు శాలువకప్పి సన్మానిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా వర్సిటీ సమీపంలోని గాయత్రినగర్‌కు చెందిన దండు పూజ 2023 అక్టోబరులో గోవాలో జరిగిన నేషనల్ గేమ్స్‌లో షటిల్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో బంగారు పతకం కైవసం చేసుకుంది. అలాగే టీమ్ ఉమెన్ క్యాటగిరిలో బ్రాంజ్ మెడల్ సాధించింది. ఆ మేరకు అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆమెకు నగదు బహుమతి ప్రకటించింది. ఆ తర్వాత పట్టించుకోలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు నగదు బహుమతులు జమ చేయడంలో భాగంగా పూజకు రూ.8లక్షలు అందింది. ఈ క్రమంలో ఆమె ఆదివారం శాప్ చైర్మన్ రవినాయుడిని మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పూజను సత్కరించారు. మరిన్ని పతకాలు సాధించి, దేశానికి, రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో శశిధర్ పాల్గొన్నారు.

మా భూమి కాజేశారు

● రికార్డులు తారుమారు చేసిన తహసీల్దార్
● న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



భూముల రికార్డులను చూపుతున్న బాధితులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : రికార్డులు తారుమారు చేసి కాజేసిన మా భూమిని ఇప్పించి న్యాయం చేయాలని బాధితులు అనసూయమ్మ, పాండురంగయ్య కోరారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తి పిట్టలవారి సంధుకు చెందిన తాము బుచ్చినాయుడుకండ్రిగ మండలం పల్లమాల గ్రామంలో సర్వే నంబరు 79/3లో ఐదు ఎకరాల భూమిని 2011లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ భూమి 2012లో తమ అనుభవంలోకి రాగా 2019లో పాసుపుస్తకాలు కూడా మంజూరైనట్లు చెప్పారు. పంటల సాగు నిమిత్తం శ్రీకాళహస్తి ఇండియన్ బ్యాంకులో రుణం కూడా తీసుకున్నట్లు తెలిపారు. కొన్ని రోజులుగా పల్లమాల గ్రామానికి చెందిన శేఖర్ భూమి తమదంటూ వివాదానికి దిగడంతో కేసులు కూడా అయ్యాయని వివరించారు. కోర్టులో కేసు వేసినట్లు చెప్పారు. ఈనెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో తమ పేరుతోనున్న భూములు 10వ తేదీకి రవీంద్రబాబు పేరుమీదకు మారిపోయాయని తెలిపారు. ఇది తహసీల్దారు చేసిన కుట్ర అని ఆరోపించారు. ఈ విషయమై అడిగితే సరైన సమాధానం ఇవ్వకపోగా హైకోర్టు ఆదేశాలతో రికార్డులు మార్చినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈనెల 17వ తేదీన బీఎన్‌కండ్రిగ తహసీల్దారు కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. దీంతో తమపై కేసులు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి, విచారణ జరిపి రికార్డులు తారుమారు చేసిన అధికారులపై చర్యలు తీసుకుని తమ భూమి ఇప్పించి న్యాయం చేయాలని, లేకపోతే ఆత్మహత్యే శరణ్యమని స్పష్టం చేశారు.

ఉద్యోగుల హామీల అమలు హర్షణీయం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడమే కాకుండా బకాయిలు చెల్లిస్తుండటం హర్షణీయమని ఏపీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు అన్నారు. స్థానిక ఏపీఎన్జీవోస్ భవనంలో ఆదివారం ఏపీఎన్జీవోస్ నేతలతో కలిసి థ్యాంక్యూ సీఎం సార్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో డీఏ ప్రకటించకుండా, బకాయిలు చెల్లించకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించడం సంతోషకరమన్నారు. జీపీఎస్, ఏపీజీఎల్ఐ, సీపీఎస్‌లతోపాటు ఉద్యోగులకు రావాల్సిన కాంట్రిబ్యూషన్, ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను కలిపి ఇప్పటికే రూ.15 వేల కోట్లు చెల్లించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు, కోశాధికారి శ్రీనివాసులు, నేతలు మురళి, లోకేష్ పాల్గొన్నారు.

ఐఏఎస్‌వో జాతీయ కార్యదర్శిగా డాక్టర్ నరేంద్ర

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ సర్జికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేంద్ర ఐఏఎస్‌వో(ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ అంకాలజీ) జాతీయ కార్యదర్శిగా ఎన్నికైనట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం గోవాలో నిర్వహించిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ అంకాలజీ 38వ జాతీయ సదస్సులో జాతీయ కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, పలువురు వైద్యాధికారులు ఆయన్ను అభినందించారు.

బీఎస్ఎన్ఎల్ రూపాయి ప్లాన్

30 రోజులు ఉపయోగించుకోవచ్చు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు రూపాయి ప్లాన్ విడుదల చేసింది. రూపాయి సిమ్ కొనుగోలు చేసి యాక్టివేషన్ చేసుకుంటే 30 రోజులు 4జీ మొబైల్ సేవలను ఉచితంగా అందిస్తుందని డీజీఎం వెంకోబరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి రోజు నుంచి నవంబరు 18వ తేదీ వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. అపరిమితంగా వాయిస్‌కాల్స్ చేసుకునే అవకాశముందని తెలిపారు. రోజుకు 2జీబీ హైస్పీడ్ డేటాను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పంపుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కూటమి పాలనలోనే ఉద్యోగావకాశాలు



యువతతో కలిసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ శమిపతి

పుంగనూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలోనే యువతకు అధిక సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు దక్కినట్లు పుంగనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ శమిపతి అన్నారు. ఆదివారం స్థానిక కృష్ణమరెడ్డిపల్లె మార్గంలోని శ్రీకృష్ణాలయంలో పుంగనూరు పరిసర ప్రాంతాల్లో డీఎస్సీ, పోలీసుశాఖలో ఉద్యోగాలు సాధించిన యాదవ యువతీ, యువకులను యాదవ కులసంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు సంఘనాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలో ఉంటేనే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్డుకు జనసేన మరమ్మతులు



గట్టువారిపల్లె మార్గంలో రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న జనసైనికులు

సోమల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల రాకపోకలు స్తంభించాయి. ఈక్రమంలోనే సోమల -సదుం మార్గం నంజంపేట, గట్టువారిపల్లె మార్గంలో తారురోడ్డు గుంతలు పడ్డాయి. వాహనాల రాకపోకలు, ప్రయాణాలు గగనంగా మారాయి. జనసేన మండల అధ్యక్షుడు భూషన్ రాయల్, జనసైనికులతో కలిసి సొంత నిధులతో ఎక్స్‌కవేటర్‌తో పలు చోట్ల గుంతలను పూడ్చి పనులు ముమ్మరం చేశారు.

కరాటే విద్యతో ఆత్మవిశ్వాసం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): యువత కరాటే నేర్చుకోవడంతో వారిలో ఆత్మవిశ్వాసం పెరగడంతోపాటు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పుంగనూరు సీఐ సుబ్బరాయుడు అన్నారు. ఆదివారం స్థానిక గోకుల్ సర్కిల్‌లో ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ ఆకాడమి కరాటే స్కూల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా కరాటే నేర్చుకోవాలన్నారు. కరాటేపై శిక్షణ ఇవ్వడానికి అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కరాటే గ్రాండ్ మాస్టర్లు ఇస్మాయిల్, శ్రీనివాసులు, ఖాదర్‌బాషా, మన్సూర్, అంజుమాన్ కమిటీ కార్యదర్శి ఇబ్రహీం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ , చాంద్‌బాషా, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు


పుంగనూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు పుంగనూరు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో వివిధ ప్రాంతాల్లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు నిఖిల్‌సాయి, రెడ్డి, కుసుమలకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. మణికంఠకు కుట్టుమిషన్ అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ శివ, ప్రతినిధులు వరదారెడ్డి, ముత్యాలు, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చల్లాను కలిసిన టీడీపీ నాయకులు



రొంపిచెర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డిని ఆదివారం రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. రొంపిచెర్ల సర్పంచ్ ఇబ్రహీంఖాన్, బోడిపాటివారి పల్లె మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారితో పాటు రొంపిచెర్ల ఉపసర్పంచ్ లక్ష్మయ్య, నాగరాజ, శ్రీపతి, ధనంజయనాయుడు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ ప్రాంతానికి ప్రవేశం లేదు





కాలువపల్లిలో కౌండిన్య రిజర్వాయర్, ప్రవేశం నిషేధిస్తూ ఏర్పాటు చేసిన బ్యానర్

పలమనేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని కాలువపల్లి వద్ద కౌండిన్య నదిపై పలమనేరు ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన కౌండిన్య జలాశయం వద్దకు ఇతరుల ప్రవేశాన్ని నిషేధిస్తూ మున్సిపల్ అధికారులు డిజిటల్ బోర్డు ఏర్పాటు చేశారు. గత 10 రోజులుగా రిజర్వాయర్ నిండి ఉధృతంగా ప్రవహిస్తోంది. వారం క్రితం ఓ వ్యక్తి మద్యం తాగి రిజర్వాయర్‌లో పడిపోయాడు. అయితే గుర్తించిన కొందరు యువకులు రిజర్వాయర్‌లోకి పడిపోయిన ఆ వ్యక్తిని రక్షించారు. ఈ సంఘటన మరచిపోక ముందే కళ్యాణరేవులు జలపాతం వద్దకు వెళ్లి యూనిస్ అనే యువకుడు దూకడంతో రిజర్వాయర్ వెళ్లే మార్గంలో కంచె వేసి రిజర్వాయర్ వద్దకు ప్రవేశించరాదని మున్సిపల్ అధికారులు డిజిటల్ బోర్డు ఏర్పాటు చేశారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉపాధ్యాయులు

రామకుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం డీఏ ప్రకటించడంపై గుడుపల్లెలో ఉపాధ్యాయులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు కేశవులు, రాజేశ్వరకుమార్, శ్రీరాములు, సురేంద్రబాబు, నారాయణస్వామి, గాలి సురేష్, రామచంద్ర, సుబ్రహ్మణ్యం, భాస్కర్, గణపతి, తులసీదాసు, ఆనందరెడ్డి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగుల పక్షపాతి



పచ్చార్ల సుధాకర్

సదుం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఉద్యోగుల పక్షపాతి అని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షులు పచ్చార్ల సుధాకర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటనపై ఆయన ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ డీఏ బకాయిలు విడుదల చేస్తామని, సరెండర్ లీవులు, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని ప్రకటించడంపై యన జిల్లా ఉపాధ్యాయుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగసంఘాల నాయకులతో స్వయంగా సీఎం చంద్రబాబునాయడు చర్చలు జరపడం శుభ పరిణామమని తెలిపారు.

వాహన చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి

పుంగనూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ద్విచక్రవాహనాన్ని చోరీ చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు గుర్తించిన వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేసి ఆదివారం పోలీసులకు అప్పగించారు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని కొత్తయిండ్లులో ఓ వ్యక్తి ద్విచక్రవాహనానికి తాళాలు తీయడానికి ప్రయత్నం చేస్తుండగా గుర్తించిన స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. విద్యుత్ స్తంభానికి తాళ్లతో కట్టి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాయుడు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. విచారించగా కర్ణాటక రాష్ట్రం నంగిలికి చెందిన మానసిక రోగిగా గుర్తించి వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ప్రొఫెసర్ వెంకటరెడ్డి, మాజీ ఎంపీ

చౌడేపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దిగంలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి మాజీ ఎంపీ రెడ్డెప్ప, ప్రొఫెసర్ వెంకటరెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఎఫ్‌ఎస్ అధికారి గౌతమి, బ్యాంకు రెడ్డెప్ప, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక కేదారేశ్వరి వ్రతం

రామకుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కేదారేశ్వరీదేవి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం, మంగళవారం పూజలు కొనసాగుతాయని తెలిపారు.

పరిశుభ్రమైన వంతెన



వంతెన క్లీనింగ్ పనులు
పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ పర్వదినం సందర్భంగా కుప్పం పట్టణంలోని ఫ్లై ఓవర్ పరిశుభ్రమైంది. పలమనేరు - కుప్పం జాతీయ రహదారిలో కుప్పం పట్టణం మీదుగా వెళ్తున్న ఫ్లైఓవర్‌ను ఆదివారం మున్సిపల్ సిబ్బంది చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. ఫుట్‌పాత్‌లపై పేరుకొన్న చెత్తను, నిల్వ చేరిన వర్షపునీటిని తొలగించారు. మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు స్వయంగా ఈ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ తర్వాత ఫ్లై ఓవర్ సుందరీకరణ పనులు చేపట్టి పూర్తి చేస్తామని తెలిపారు.

ఘనంగా ఆయుధపూజ



టీడీపీ కార్యాలయంలో జరిగిన ఆయుధ పూజలో నేతలు

రామకుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. వేదపండితులు నాగరాజశర్మ పూజలు చేశారు. అనంతరం నేతలు, కార్యకర్తలకు తీర్థప్రసాదాలు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నేతలు టీడీపీ శ్రేణులకు, మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు మాజీ వైస్ఎం తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో అధ్యక్షుడు మహ్మద్‌రఫీ, కడ సలహా కమిటీ సభ్యుడు రఘు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు మురళి, క్లస్టర్ ఇన్‌చార్జి, కో-ఇన్‌చార్జిలు రవిరెడ్డి, నవీన్, నేతలు రామ్మూర్తి, గుర్రప్ప, నరసింహులు, గంట్లప్పగౌడు, కామరాజనాయక్, శ్రీనివాసులుగౌడు, సత్తి, టీవీ రవి, భానుమూర్తి, మంజునాథరెడ్డి, కృష్ణారెడ్డి, రామకృష్ణప్ప, బాలరాజు, సుబ్రీ, సతీష్, పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

కౌండిన్య నదిపై వంతెన నిర్మించాలి

పలమనేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలం జల్లిపేట గ్రామ సమీపంలోని కౌండిన్య నదిపై వంతెన నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండు చేశారు. ఆదివారం ఆయన జల్లిపేట రోడ్డుపై కౌండిన్య నది ప్రవాహాన్ని పరిశీలించారు. రోడ్డుపక్కనే కౌండిన్యపై నిర్మించిన చెక్‌డ్యాం నుంచి సరాసరి జల్లిపేట రోడ్డుపై నీరు ప్రవహిస్తున్నందున ఈ మార్గంలోని మూడు గ్రామాల్లోని దాదాపు 500 కుటుంబాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత 50 ఏళ్లగా మూడు గ్రామాలకు చెందిన ప్రజలు కౌండిన్యపై వంతెన నిర్మించాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

30న ఎక్సైజ్ వాహనాల వేలం

నగరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు ఈ నెల 30వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ప్రభుత్వం వారు నిర్ణయించిన ధరలో 10 శాతం ధరావత్తు సొమ్మును ముందుగా చెల్లించాలన్నారు. వేలంలో దక్కించుకున్న వారు చలానాతో పాటు జీఎస్టీ చెల్లించి వాహనం స్వాధీనంచేసుకోవాలని అన్నారు. అలా చేయకుంటే కట్టిన ధరావత్తు వదులుకోవాలని, అది ప్రభుత్వ ఖజానాకు జమ అవుతుందన్నారు. వేలంలో వాహనం దక్కని వారికి ధరావత్తు సొమ్మును తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

యాదమరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు, అప్పుల బాధతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. తెల్లరాళ్లపల్లె పంచాయతీ పావడదాసూరుకు చెందిన బాలయ్య కుమారుడు మునియప్ప(34)కు తరచూ భార్యతో గొడవలు జరుగుతుండేవి. అప్పుల బాధ కూడా వెంటాడుతుండటంతో తీవ్రమన స్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆదివారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మునియప్ప మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మున్సిపల్ కార్మికులకు టపాసుల పంపిణీ



టపాసుల గిఫ్ట్ బాక్సులు స్వీకరించిన
మున్సిపల్ సిబ్బందితో బీసీఎన్ తదితరులు

కుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని బీసీఎన్ గ్రూప్ చైర్మన్ బీసీ.నాగరాజ్, వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.సునీల్ రాజ్, సీఈవో సాగర్ రాజ్ బీసీఎన్ చారిటబుల్ ట్రస్టు తరఫున కుప్పం పురపాలక సంఘం కార్మికులకు ఆదివారం టపాసులు పంపిణీ చేశారు. సుమారు రూ.లక్ష విలువైన దీపావళి క్రాకర్స్ గిఫ్ట్ బాక్సులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ పూట కార్మికులు, వారి పిల్లలు ఆనందంగా గడపాలన్నదే టపాసుల పంపిణీలోని తమ ఆంతర్యమని పేర్కొన్నారు. బీసీఎన్ చారిటబుల్ ట్రస్టు ఎప్పుడూ సమాజ సేవలో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన బంతుల పంపిణీ



పంపిణీ చేసిన సీడ్ బాల్స్‌తో
అటవీశాఖాధికారులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం, శాంతిపురం లయన్స్ క్లబ్‌లు సంయుక్తంగా అటవీశాఖ అధికారులకు ఆదివారం 20 వేల విత్తన బంతులు (సీడ్ బాల్స్) పంపిణీ చేసింది. పర్యావరణ పరిరక్షణ శాశ్వత ప్రాజెక్టులో భాగంగా సదుం లయన్స్ క్లబ్ ఈ సీడ్ బాల్స్ తయారు చేశారు. వీటినే ఇప్పుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుప్పం ప్రాంత అటవీ శాఖాధికారి జయశంకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమన్నారు. వానలు పడుతున్న ఈ సమయంలో విత్తన బంతులను అటవీ ప్రాంతంలో వెదజల్లితే మరెన్నో వృక్షాలుగా పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో అటవీ శాఖాధికారులు, సిబ్బంది, లయన్స్ క్లబ్ ప్రతినిధులు మహేశ్, సెల్వం, ప్రసాద్, జయరామ్ నాయుడు, సతీశ్, బాబు, సుధాకర్ పాల్గొన్నారు.

పేదలకు దన్నుగా మోదీ, చంద్రబాబు



రామకుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న పేదలందరికీ పీఎం నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు దన్నుగా నిలుస్తున్నారని రామకుప్పం వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి తెలిపారు. ఆదివారం విజలాపురంలో టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు కుమార్, సాగునీటి సంఘం చైర్మన్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జీఎస్టీ రద్దు, తగ్గింపులపై పీఎం మోదీ, సీఎం చంద్రబాబులకు కృతజ్ఞలు తెలుపుతూ చంద్రబాబు కుటుంబసభ్యుల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శివప్రసాద్, నేతలు గుర్రప్ప, వేణుగోపాల్‌గౌడు, రవి, జయశీలం, నారాయణదాసు, జనార్దన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, నారాయణప్ప పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధుడి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన రవికాంత్, వారి కుటుంబ సభ్యులు ఆదివారం రూ.1,00,000 చెక్కు రూపంలో విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కూటమి ప్రభుత్వంలో చెరువులకు జలకళ



బంగారక్క చెరువుకు జల హారతి ఇస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

గుడిపాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో విరివిగా వర్షాలు కురిసి చెరువులన్నీ నిండుకుండలా తలపిస్తున్నాయని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా ఛైర్మన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. ఆదివారం మండలంలోని రామిరెడ్డిచెరువు, బంగారక్కచెరువులలో వారు జల హారతి ఇచ్చారు. బంగారక్క చెరువుకు మరమ్మతులు చేపట్టాలని బీజేపీ మాజీ అధ్యక్షుడు ధనంజయ నాయుడు ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సీఆర్ రాజన్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, జీజేఎం ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవుల నాయుడు, జగజ్జీవన్, మండల నాయకులు బాలాజీనాయుడు, హేమాద్రినాయుడు, అనిల్‌కుమార్, ప్రతాప్‌నాయుడు, పీటర్, విజయ్‌నాయుడు, రవీంద్ర నాయుడు, గుర్రప్పనాయుడు, హరిప్రసాద్, సుమిత, మురళినాయుడు, ఉదయ, శిల్ప, లీలావతి, రాజేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సుబ్రహ్మణ్యం

శ్రీరంగరాజపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు పెనుమూరు గ్రామానికి చెందిన హేమాద్రి, ప్రసాద్, రమేష్‌లు ఆటోలో పళ్లిపట్టుకు వెళ్తుండగా, గంగాధర నెల్లూరు మండలం వేటుకూరుకు చెందిన సుబ్రహ్మణ్యం(60) తన బంధువు ఇంటికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో వస్తుండగా, ఎస్‌ఆర్‌పురం మండలం చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిలో సంగం డెయిరీ వద్ద ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుబ్రహ్మణ్యంను 108లో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలిస్తుండగా, మార్గమధ్యంలో సుబ్రహ్మణ్యం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

యాదమరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు, అప్పుల బాధతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... తెల్లరాళ్లపల్లె పంచాయతీ పావడదాసూరుకు చెందిన బాలయ్య కుమారుడు మునియప్ప(34)కు తరచూ భార్యతో గొడవలు జరుగుతుండేవి. అప్పుల బాధ కూడా వెంటాడుతుండటంతో తీవ్రమనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆదివారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మునియప్ప మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రతి శుక్రవారం గ్రామాల్లో గ్రీవెన్స్: థామస్



ఇల్లు కోల్పోయిన కుమారికి చెక్కు అందజేస్తున్న ప్రభుత్వవిప్ థామస్

గంగాధరనెల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి శుక్రవారం నియోజకవర్గంలోని ఓ గ్రామంలో గ్రీవెన్స్ గ్రామసభ నిర్వహించనున్నట్లు ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్ తెలిపారు. అలాగే నెలలో రెండు లేదా మూడు సార్లు గ్రామ ప్రజలతో ముఖాముఖీ మాట్లాడి పల్లెనిద్ర చేస్తానన్నారు. పెద్దకాల్వ పంచాయతీ ఎల్లమరాజుపల్లెలో ఆదివారం ఆయన కూటమినేతలతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా జరిగిన గ్రామసభలో థామస్ మాటాడుతూ వైసీపీ నాయకుల తీరుపై తీవ్రంగా ధ్వజమెత్తారు. ఇటీవల వర్షాలకు ఇల్లు కోల్పోయిన కుమారి అనే ఒంటరి మహిళకు తాత్కాలిక సహాయంగా రూ.50వేల చెక్కును అందజేశారు. గ్రామ ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీనేతలు ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, శ్రీధర్‌యాదవ్, మోహన్ నాయుడు, స్వామిదాస్, హరీష్‌యాదవ్, రఘునాథ నాయుడు, పొదిలి శిల్ప, దీపక్ నాయుడు, జనసేన నేత పొన్న యుగంధర్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కాగా థామస్‌ను స్థానిక సర్పంచ్ ఏకాంబరం (వైసీపీ) మర్యాదపూర్వకంగా కలిసి శాలువకప్పి పూలబొకే అందజేశారు.

చిత్తూరు నుంచి గ్రాండ్ మాస్టర్‌ను చూడాలి



గెలుపొందిన క్రీడాకారులు

చిత్తూరు క్రీడలు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరం నుంచి ఒక గ్రాండ్ మాస్టర్‌ను చూడాలని ఏపీ చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్‌ఆర్‌టీ ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక వ్యాపమాను వీధిలోని ది స్కూల్ ఆఫ్ చెస్‌లో టౌన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నగర నలుమూలల నుంచి సుమారు వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొత్తం మూడు విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు దినేష్ తెలిపారు. అండర్-16 విభాగంలో మొదటి బహుమతిని సాత్విక్, రెండు, మూడవ బహుమతులను అక్షర, లోహిత్‌నాయక్ కైవసం చేసుకున్నారు. అండర్-12లో అనంత నిత్య, కుందనశ్రీ, విక్రాంత్, అండర్-9లో ఎస్‌ఆర్ అర్జున్, మణిదీప్, సాత్విక్, అండర్-7లో ఆదిత్య, ఎస్‌ఆర్ ఆర్యన్, సిద్ధార్థలు వరుసగా మొదటి, రెండు, మూడవ బహుమతులను కైవసం చేసుకున్నారు. అలాగే యంగెస్ట్ బాయ్ బహుమతిని కార్తికేయ, యంగెస్ట్ గార్ల్‌గా శాన్విరెడ్డిలు గెలుపొందారు. వీరందరికి మెడల్స్, మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బాలు సోమనాథ్, టోర్నమెంట్ డైరెక్టర్ లేఖ్య, సీనియర్ కోచ్ ఎస్ఆర్ దినేష్, సాయి, హరి, హరీష్, మధు, నెహర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాల విసర్జన



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 19: పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదివారం అయ్యప్ప దీక్షా మాలను విసర్జించారు. 41 రోజుల కఠిన దీక్ష తీసుకున్న ఆయన శబరిమలకు వెళ్లి అయ్యప్ప ఇరుముడిని చెల్లించి మాల విసర్జన కోసం కాణిపాకం విచ్చేశారు. వరసిద్ధుడిని దర్శించుకున్న అనంతరం ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ చేతుల మీదుగా మాల విసర్జనచేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గంగారపు హరిబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



చెక్కును విరాళంగా అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధుడి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన రవికాంత్, వారి కుటుంబ సభ్యులు ఆదివారం రూ.1,00,000 చెక్కు రూపంలో విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఐ కార్యాలయం, పోలీసుస్టేషన్‌లో ఆయుధపూజ

వెదురుకుప్పం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సీఐ కార్యాలయం, పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఆయుధ పూజ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీఐ హనుమంతప్ప, ట్రైనీ ఎస్ఐ రమేష్, పోలీసులు పాల్గొన్నారు.

పల్లె బాట పట్టిన పట్టణవాసులు

పాలసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాలలో నివశించే వారంతా పాలసముద్రం మండలంలోని తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. దీంతో గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది. పిల్లలు టపాకాయలు పేలుస్తూ ఆనందంతో సందడి చేస్తున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ప్రతి పంచాయతీలో అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటు

గుడిపాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలను మండలంలోని ప్రతి పంచాయతీలో ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. ఆదివారం తన స్వగ్రామమైన కోలావూరులో స్వంత మండలంలోని 27 పంచాయతీల్లో వీరి విగ్రహాలను ఏర్పాటు చేయడానికి స్థానిక నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జగజ్జీవన్, నాగరాజ్‌యాదవ్, శరత్, జగదీశ్వర్ నాయుడు, బాలసుబ్రహ్మణ్యంయాదవ్, కిట్టు, చల్లా, దామోదరం, గోళ్ల హరిప్రసాద్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చెత్తపోశారంటూ ఇరువర్గాల ఘర్షణ

గుడిపాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెత్త ఇంటి ముందు పోశారని ఘర్షణకు దిగి, ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని 197 రామాపురం గ్రామానికి చెందిన కుమార్, ఆనంద్‌ల మధ్య భూతగాదాలు ఉండేవి. ఆదివారం ఆనంద్ భార్య కుమారి ఇంటి ముందు చెత్త పోశారని, చెత్త మా ఇంటి ముందు ఎలా పోస్తావని కుమార్ కుటుంబ సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగి ఘర్షణకు దిగారు. దీంతో ఇరువర్గాలు గుడిపాల పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై రామ్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30న ఎక్సైజ్ వాహనాల వేలం

నగరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు ఈ నెల 30వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ప్రభుత్వం వారు నిర్ణయించిన ధరలో 10 శాతం ధరావత్తు సొమ్మును ముందుగా చెల్లించాలన్నారు. వేలంలో దక్కించుకున్న వారు చలానాతో పాటు జీఎస్టీ చెల్లించి వాహనం స్వాధీనం చేసుకోవాలని అన్నారు. అలా చేయకుంటే కట్టిన ధరావత్తు వదులుకోవాలని, అది ప్రభుత్వ ఖజానాకు జమ అవుతుందన్నారు. వేలంలో వాహనం దక్కని వారికి ధరావత్తు సొమ్మును తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు.

థియేటర్‌లో సీట్లకోసం.....

చిత్తూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర థియేటర్ వద్ద ఆదివారం రాత్రి వాగ్వాదం చోటుచేసుకుంది.నగరానికి చెందిన ఓ కుటుంబం సెకండ్ షోకు వచ్చింది. టికెట్ కౌంటర్ వద్ద కుటుంబంతో వచ్చాను పలానా సీట్లు కావాలని ఆ ఇంటి యజమాని కోరాడు. అందుకు సరే అన్న టికెట్లు ఇచ్చే వ్యక్తి ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించమన్నాడు. తీరా డబ్బులు పంపించాక వేరే సీట్లు కేటాయిస్తానని చెప్పడంతో ఆ ప్రేక్షకుడు తన డబ్బులు వెనక్కివ్వాలని కోరాడు. దీనికి టికెట్లు ఇచ్చే వ్యక్తి ఆ టికెట్లు తీసుకోవాల్సిందేనని దురుసుగా ప్రవర్తించాడు. థియేటర్ నిర్వాహకుడు కూడా తీసుకుంటే ఆ టికెట్ తీసుకో.. లేకుంటే బయటకు వెళ్లు అనడంతో ఆ ప్రేక్షకుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి టికెట్ల డబ్బులు వెనక్కి ఇప్పించారు.

ఎన్‌డీఏ ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు

● ప్రభుత్వ విప్ థామస్



జీఎస్టీ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ థామస్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో ఏన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ప్రజలకు మేలు కలిగించే పలు కార్యక్రమాలను చేపడుతున్నామని, ఇందులో వన్ నేషన్- వన్ ట్యాక్స్ అమలు అనేది చారిత్రాత్మక నిర్ణయమని ప్రభుత్వ విప్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ చెప్పారు. ఆదివారం సూపర్ జీఎస్టీ-సూపర్ తగ్గింపుపై జిల్లాలోని అన్ని శాఖల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే భవన్‌లో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 ద్వారా పన్నులను తగ్గించిందని చెప్పారు. జీఎస్టీ వల్ల జరిగే మేలును జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి దాదాపు ఏడాదికి రూ.18 నుంచి రూ.20వేల మేర ఆదా అవుతుందన్నారు. అనంతరం జ్యోతిరావు పూలే భవనంలో ఏర్పాటు చేసిన 36 స్టాళ్లను ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ఈ సమావేశంలో డీఆర్వో మోహన్ కుమార్, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

బంగారుపాళ్యం, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): పిల్లలు పుట్టలేదని మనస్తాపంతో ఓ వివాహిత బలవంతంగా బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని వెలుతురుచేను పంచాయతీ శ్రీనివాసపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. శ్రీనివాసపురానికి చెందిన ప్రకాష్‌కు గుడియాత్తం తాలూకా తట్టపారకు చెందిన రాజశ్రీతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ఈ నేపథ్యంలో పిల్లలు కలగలేదని మనస్తాపంతో శనివారం ఇంటిలో నుంచి వెళ్లిపోయింది. దీంతో బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం పులిమడుగు సమీపంలోని మునిక్రిష్ణయ్య బావిలో రాజశ్రీ(20) మృతదేహం లభ్యమైంది. బంగారుపాళ్యం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దీపావళి పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలి



చిత్తూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ తుషార్ డూడీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. భద్రతా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా జరుపుకోవాలన్నారు.రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాద నివారణ చర్యల ద్వారా ప్రజలకు సహకరించడానికి పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉంటారన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మురళీ



ఎన్నికైన నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం

చిత్తూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని ఓ పాఠశాలలో సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాస్కర్, కార్యదర్శిగా షణ్ముగం, అసోసియేట్ అధ్యక్షుడిగా సంతానం, అడిషనల్ కార్యదర్శిగా వినాయక, కన్వీనర్‌గా బాబు, ఉపాధ్యక్షులుగా సుబ్రమణ్యం, ప్రసాద్, రమేష్, నవీన్, నరేష్, సుబ్బలక్ష్మి, ప్రణీత, రజిని, కవిత, సురేఖ, మాధవ ప్రసాద్, రఘుపతి, గుణశేఖర్, షణ్ముగం, అన్బురాజ్, సిద్ధయ్య, కృష్ణప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా దేవరాజులు, మహేష్, కుమార్, ప్రవీణ్, చిరంజీవి, ప్రగతి, ప్రతిభ, చెన్నకేశవులు, కృష్ణయ్య, వెంకటరమణ, రెడ్డప్ప, చిన్నయ్య, చెంగయ్య, పురుషోత్తం, రమ్య, సులోచన, లోకనాథన్, సురేష్, చిన్నప్ప, మురగయ్య, గుణశేఖర్, రాజేష్, మొగిలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు.

కలెక్టర్, ఎస్పీలకు దీపావళి శుభాకాంక్షలు



ఎస్పీ తుషార్ డూడీకి స్వీటు బాక్సును ఇస్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ పిల్లలతో కలిసి ఆదివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ కుటుంబ సభ్యులను, ఎస్పీ తుషార్ డూడీ కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి దీపావళి శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు అందజేశారు.

చిన్నారుల సందడి



శ్రీరంగరాజపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దికుప్పం, నెలవాయి, ఎగువకమ్మకండ్రిగ, 49.కొత్తపల్లె, క్షీరసముద్రం, పుల్లూరు, వెంకటాపురం, పిళ్లారికుప్పం, కటికపల్లి గ్రామాల్లో దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పిల్లలు ఉత్సాహంగా టపాసులు కాలుస్తూ సందడి చేశారు.

డీఏ ప్రకటనపై ఎన్‌టీఏ హర్షం



చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ప్రభుత్వం డీఏ ప్రకటించడంపై నోబుల్ టీచర్స్ అసోషియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక తపోవనం పాఠశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు మాట్లాడుతూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నాయకులు నీరజాక్షుల నాయుడు, రామయ్య, బాబురెడ్డి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

పుంగనూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు పుంగనూరు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో వివిధ ప్రాంతాల్లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు నిఖిల్‌సాయి, రెడ్డి, కుసుమలకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. మణికంఠకు కుట్టుమిషన్ అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ శివ, ప్రతినిధులు వరదారెడ్డి, ము త్యాలు, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే ఉద్యోగావకాశాలు

పుంగనూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలోనే యువతకు అధిక సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు దక్కినట్లు పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ శమిపతి అన్నారు. ఆదివారం స్థానిక కృష్ణమరెడ్డి పల్లె మార్గంలోని శ్రీకృష్ణాలయంలో పుంగనూరు పరిసర ప్రాంతాల్లో డీఎస్సీ, పోలీసుశాఖలో ఉద్యోగాలు సాధించిన యాదవ యువతీ, యువకులను యాదవ కులసంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు సంఘనాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలో ఉంటేనే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో పాట్నా హైకోర్టు న్యాయమూర్తి



సినీ హీరో గల్లా అశోక్‌కు జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు



టీటీడీ సీవీఎస్వోకు జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని ఆదివారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమచక్రవర్తి దర్శించుకున్నారు. అలాగే స్వామిని ప్రముఖ సినీహీరో గల్లా అశోక్, తిరుమల, తిరుపతి ఆలయ చీఫ్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి మురళీకృష్ణ స్వామిని విడివిడిగా దర్శించుకున్నారు. వారిని ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వారిని వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ చైర్మన్ మణి నాయుడు, సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి: ఆపస్



చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించారు. 2023 జూలై నుంచి అమలు చేయాల్సిన వేతన సవరణ కమిటీ చైర్మన్‌ను నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. 2003 డీఎస్సీ అభ్యర్థులకు పాత పెన్షన్ విధానం అమలు, రూ.30 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని కోరారు.

ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం

● ఎపీ ఎన్‌జీవో సంఘ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల డిమాండ్లపై సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికారుల స్పందన హర్షణీయమని ఎపీ ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు చెప్పారు. ఆదివారం ఎన్‌జీవో భవనంలో జిల్లా స్థాయి ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ లీవులను సర్వీసులో ఎప్పుడైనా వినియోగించుకోవచ్చని సీఎం చెప్పడం మహిళా ఉద్యోగుల్లో సంతోషాన్ని నింపిందన్నారు. దీపావళి పండుగ ముందే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ఐదేళ్ల తరువాత ఈ స్థాయిలో జరగడం సంతోషంగా ఉందన్నారు. ఎన్‌జీవో కార్యదర్శి రమేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కరెంటు సరఫరా కష్టాలపై ఎమ్మెల్యేకి ఫిర్యాదు



ఎమ్మెల్యే థామస్‌కి ఫిర్యాదు చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సుధాకర రెడ్డి

వెదురుకుప్పం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని దిగువపల్లాలు, యనమల మంద, ఆళ్లమడుగు గ్రామ పంచాయతీల్లో కరెంటు సరఫరా కష్టాలు ఉన్నాయని, అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని ఆదివారం ఎమ్మెల్యే థామస్‌కి చవటగుంట పీఏసీఎస్ చైర్మన్ బోడిరెడ్డి సుధాకరరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

● కారును తప్పించబోయి బోల్తాపడ్డ డీజిల్ ట్యాంకర్



బోల్తాపడ్డ డీజిల్ ట్యాంకర్



డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

బంగారుపాళ్యం, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిలో సంక్రాంతిపల్లె వద్ద ఆదివారం కారును తప్పించబోయిన డీజిల్ ట్యాంకర్ బోల్తాకొట్టింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు సంక్రాంతిపల్లె వద్దకు చేరుకోగానే అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. అదే సమయంలో యాదమరి నుంచి డీజిల్ లోడుతో పలమనేరు వైపు వెళుతున్న ట్యాంకరు వైపు కారు దూసుకొచ్చింది. దీంతో డీజిల్ ట్యాంకర్ డ్రైవర్ ఆ కారును తప్పించబోగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న చిత్తూరు అగ్నిమాపక సిబ్బంది బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు, ఎస్సై ప్రసాద్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను మళ్లించి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR
I.P.No. 35 of 2025

Between:
V.Ramesh, S/o V.Venkatamuni Naidu, r/at Chipparapalli, Penumuru mandal, Chittoor District, Andhra Pradesh-517126; **...Petitioner**
And:
A.Narayana Chetty & 7 Others **...Respondents**

NOTICE TO RESPONDENTS 1 TO 8 AND GENERAL NOTICE TO PUBLIC

1. **A.Narayana Chetty**, S/o A.Sreenivasulu Chetty, r/at Raghavareddy palli Penumuru mandal, village, Murupupalli post, Chittoor District,
2. **G.Mallikarjuna Naidu**, S/o S.Chengalraulu Naidu, r/at Gunturu vandlavuru village and post, Penumuru mandal, Chittoor District.
3. **D.Mahesh**, S/o D.Venkatamuni, r/at Gandapodivaripalle village, Peumuru post and mandal, Chittoor Dist
4. **K.Rajagopal Naidu**, S/o Bodaiah, r/at Gunturuvandlavuru village and post, Penumuru mandal, Chittoor Dist.
5. **P.Kishore Kumar Reddy**, S/o Goverdhan Reddy, Army person, native of Kadapa, now resident of Bangalore.
6. **D.Gajendrudu**, S/o D.Muthyala Naidu, resident of Penumuru village and mandal
7. **Venugopal**, S/o Yellappa, Retired army person, resident of Tirupati urban mandal, Tirupati Revenue Dist.
8. **D.Parandama Naidu**, S/o D.Munaswami Naidu, Army person, resident of Bangalore.

Sirs, Please take notice that the petitioner has filed above IP against you to declare him as an Insolvent. The said IP is posted to **13-11-2025** for your appearance. Hence, the Nos.1 to 8 of you and General Public i.e if any one has lent the money to the Petitioner, Please be present on the said date before the said court on **13-11-2025 at 10.30 a.m.**, either in person or an Advocate and file your objections if any, failing which the matter will be decided in your absence as ex-party.
(By Order of the Hon'ble Court)

E.RENUKA,
Advocate for Petitioner

విత్తన బంతుల పంపిణీ

కుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం, శాంతిపురం లయన్స్ క్లబ్‌లు సంయుక్తంగా అటవీశాఖ అధికారులకు ఆదివారం 20 వేల విత్తన బంతులు (సీడ్ బాల్స్) పంపిణీ చేసింది. పర్యావరణ పరిరక్షణ శాశ్వత ప్రాజెక్టులో భాగంగా సదుం లయన్స్ క్లబ్ ఈ సీడ్ బాల్స్ తయారు చేశారు. వీటినే ఇప్పుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుప్పం ప్రాంత అటవీ శాఖాధికారి జయశంకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమన్నారు. వానలు పడుతున్న ఈ సమయంలో విత్తన బంతులను అటవీ ప్రాంతంలో వెదజల్లితే మరెన్నో వృక్షాలుగా పెరుగుతాయని చెప్పారు.

కరాటే విద్యతో ఆత్మవిశ్వాసం



పుంగనూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): యువత కరాటే నేర్చుకోవడంతో వారిలో ఆత్మవిశ్వాసం పెరగడంతోపాటు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పుంగనూరు సీఐ సుబ్బరాయుడు అన్నారు. ఆదివారం స్థానిక గోకుల్ సర్కిల్‌లో ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ ఆకాడమి కరాటే స్కూల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా కరాటే నేర్చుకోవాలన్నారు. కరాటేపై శిక్షణ ఇవ్వడానికి అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కరాటే గ్రాండ్ మాస్టర్లు ఇస్మాయిల్, శ్రీనివాసులు, ఖాదర్‌బాషా, మన్సూర్, అంజుమాన్ కమిటీ కార్యదర్శి ఇబ్రహీం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ , చాంద్ బాషా, కరాటే విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురం రిజర్వాయర్ గేటు ఎత్తివేత

వెదురుకుప్పం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్ గేటును ఆదివారం ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో ఆ నీరు వృథాగా తమిళనాడుకు తరలిపోయింది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల వరద నీరు కృష్ణాపురం రిజర్వాయర్‌లో చేరడం వల్ల, గేటును ఎత్తి నీటిని విడుదల చేశారు.